# పేరులో పెన్నిధి



"మీ కోసం ఎవరో వచ్చారు" అంది లలితమ్మ.

"ఎవరు?"

"ఎవరో నాకేం తెలుసు?"

"మగా? ఆడా?"

"ఏభై ఏళ్ళ వయసులో ఏం ఆశ! మగవాళ్ళే వచ్చింది. ఆడవాళ్ళు కాదు" అంది లలితమ్మ నవ్వి.

"ఎన్నేళ్ళుంటాయి?"

"ఇరవై ఏళ్ళుంటాయి."

"ఎలా ఉన్నారు?"

"బ్రహ్మచారిలా, బట్టతల."

కోటిరెడ్డిగారు ఆలోచనలో పడ్డారు.

"ఏమి ఆలోచిస్తున్నారు?"

"ఎవరై ఉంటారా అని."

"వెళ్ళి మాట్లాడండి. ఎవరైతే నేం?"

"ఎవరో ముందు తెలుసుకుంటే ఏం పనిమీద వచ్చారో, ఏం మాట్లాడాలో ఊహించుకోవచ్చు."

"మీరు ఊహించినా తెలియదు. వెళ్ళండి."

కోటిరెడ్డిగారు భుజం మీద తువ్వాలు వేసుకుని వరండాలోకి వెళ్ళేసరికి అక్కడ ముసలాయన ఎవరూ లేరు. పాతికేళ్ళ కుర్రవాడు ఉన్నాడు.

"నమస్కారం, సార్" అన్నాడతను.

అనుకోనిది జరగగానే తడబడి, "నమస్కారం" అని వెనక్కి తిరిగి, తలుపు వైపు చూశారాయన. లలితమ్మ తలుపు దగ్గర నించుని తన్ను ఒప్పుకుంటున్నట్లుగా చెంపలు వేసుకుని దణ్ణం పెట్టింది నవ్వుతూ.

ఇక తప్పనిసరిగా వాలు కుర్చీలో కూర్చుని, "ఏమిటి సంగతి?" అన్నారాయన.

"చెప్పా కదండి? ఉద్యోగం సంగతి. రేపు ఇంటర్వ్యూట."

"అప్లయ్యా. అప్లికేషన్ పెట్టావుగా? ఇంటర్వ్యూకి వెళ్ళు."

"ఇంటర్వ్యూలో వాళ్ళకు కావలసిన వాళ్ళను వేసుకుంటారు."

"అయినా ..."

"మీరు ఒక మాట చెప్పితే ..."

"నేనా?!"

"మీకు కంపెనీ ప్రొప్రయిటరు గారు చిన్నప్పటి స్నేహితులని చెప్పారు. మీరు చెబితే మేనేజరుగారు వింటారు."

"మేనేజరా ఇంటర్వ్యూ చేసేది?"

"అవును, సార్!"

"ఉద్యోగం ఇచ్చేది కూడా ఆయనేనా?"

"అంతా ఆయనదేనండి. ప్రొప్రయిటరు గారు ఇలాంటి విషయాల్లో కల్పించుకోరు."

"మరయితే నాకా మేనేజరు ఎక్కువ పరిచయం లేదు కదోయ్?" అన్నారాయన.

అది నిజమే. ప్రొప్రయిటరు కోటిరెడ్డి గారికి తన కంపెనీ అంతా చూపించినప్పుడు మేనేజర్‌కు తన చిన్ననాటి స్నేహితుడుగా పరిచయం చేశారు. అయితే అదొక్కసారే కోటిరెడ్డిగారు వెళ్ళింది.

"శ్రమ అనుకోకుండా మీరే సహాయంచెయ్యాలి, సార్."

"ఇప్పుడే వస్తాను" అంటూ లోపలికి వచ్చారాయన.

లలితమ్మ కాఫీ కప్పుతో ఎదురు వచ్చింది.

"ఎవరికి కాఫీ?"

"మీకే."

"దేనికి? నే నడిగానా?"

"మీ రడగలేదు. నేనే తెచ్చాను. మీరు నన్ను తిట్టకుండా ఉండడానికి."

"సరే గాని, ఎందుకలా చెప్పావు?"

"ఆ అబ్బాయి మీకోసం మూడుసార్లు వచ్చాడు— మీరు తప్పించుకుంటున్నారు. ఇంట్లో ఉండీ లేనని చెప్పిస్తున్నారు."

## కాశీనాథ, కాశీనాథ

"ఎందుకు చెప్పిస్తున్నావని?"

"ఎందుకో? పాపం! ఆ అబ్బాయి దేనికోసమో వస్తున్నాడు. మొదటిసారి వచ్చినప్పుడు సొంతం చెప్పనియ్యకుండానే పనుందని వచ్చేశారు."

"అతను ఉద్యోగంకోసం వస్తున్నాడు. సిఫార్సు చెయ్యమంటాడు."

"చెయ్యండి. మాట సాయం చేస్తే అరిగిపోతారా?"

"అరిగిపోవడం కాదు. నా కిష్టం లేదు. సిఫార్సు అంటే— 'అర్హతలేదుకాని, ఉద్యోగం ఇవ్వండి' అని అడగటమేగా?"

"సరే. మీ ఇష్టం" అంది లలితమ్మ.

అయితే ఆ అబ్బాయికి సహాయం చెయ్యాలనే అనిపించింది కోటిరెడ్డి గారికి. తను చెప్పితే ఉద్యోగం వస్తుంది. తన మాటకు అక్కడ విలువ ఉంది. తనకు ఆ కుర్రవాడంటే అభిమానం కలగక పోయినా, అతనికి ఆ ఉద్యోగానికి అర్హత సంగతి తెలియక పోయినా ఎందుకో అతనికి సహాయం చెయ్య అనిపించింది. తెలిసో, తెలియకో భార్య ప్రోత్సహించడమే చాలా వరకు కారణం.



ప్రియుడు ప్రియురాలితో—

"రాధ నా జీవిత నావకు తెరచాపలా నిలిచి పోయి, నా నావను సాగించు.

రాధ: సారీ రాజా! నాకు గాలిలో నిలవటం చేతకాదు.

—సి. పి.

* * * *

ఇంటర్వ్యూ అయిన మరునాడు కోటిరెడ్డిగారు ప్రయత్నించి తీరిక చేసుకొని భుజం మీద కండువా వేసుకుని బయలు దేరారు. రిక్షా ఎక్కితే పావుగంట.

"రండి, సార్! కూర్చోండి. కంపెనీ చూడటానికి వచ్చారా?" అంటూ ఆహ్వానించి తన గదిలోకి తీసుకుని వెళ్ళాడు మేనేజరు సీతాపతి.

సీతాపతికి నలభై ఏళ్ళు ఉంటాయి. కొంచెం నవ్వుపాటి మనిషి. నిదానస్తుడిలా, తెలివయిన వాడిలా కనిపిస్తాడు. ఫుల్‌షర్టు, పాంటు వేసుకున్నాడు.

కోటిరెడ్డిగారు అతను చూపించిన కుర్చీలో కూర్చున్నారు.

"ఏమిటి, సార్? కాఫీ తీసుకుంటారా? డ్రింకు తీసుకుంటారా?"

"ఏదీ వద్దు."

"ఏదో ఒకటి తీసుకోండి."

"అలవాటు లేదు."

"కాఫీ తెప్పిస్తాను. కాదనకండి" అన్నాడు సీతాపతి.

ఇంతలో ఆఫీసు రూములో కలకలం రేగింది. అంతా ఒక చోట గుమిగూడారు. ఎవరినో బయటికి తీసుకు వెడుతున్నారు.

మేనేజరు బయటికి వెళ్ళాడు. ఐదు నిమిషాలలో తిరిగి వచ్చాడు. "మా గుమాస్తా ఒకతనికి వాంతులు అవుతున్నాయి. మనిషి వేళ్ళాడిపోతున్నాడు" అన్నాడు.

"వాంతులా?" అన్నారు కోటిరెడ్డిగారు కంగారుగా.

ఆయన ముఖం వాడి పోయింది క్షణంలో. తన జీవితంలో జరిగిన వెనకటి కథ అంతా కళ్ళ ముందు కదిలింది — తన మొదటి భార్యకు వాంతులు రావటం, కలరా అవి గురి౦చేలోగా అంతా అయిపోవటం.

ఆయన మొహం మీద చెమటలు పట్టేశాయి.

"ఏమిటి, సార్, అలా అయిపోయారు?" అన్నాడు సీతాపతి కంగారుగా.

"ఏం లేదు" అన్నారు కోటిరెడ్డిగారు. ఇంకా తేరుకోలేదు. "వాంతులయితే వెంటనే హాస్పిటల్లో చేర్పించండి" అన్నారు.

"ఎందుకు? అవే తగ్గిపోతాయి. రెండు లవంగాలు నోట్లో వేసుకుంటే సరి!"

"కాదు. నిర్లక్ష్యం చెయ్య కూడదు. కలరా ఏమో?"

మానేజరు ఆశ్చర్యంగా చూశాడు. "అయి ఉండదు, సార్! ఊళ్ళో, ఎక్కడా లేదు" అన్నాడు.

కోటిరెడ్డిగారు బాధగా వెనక్కి వాలారు. తల నొప్పిగా, భారంగా ఉన్నట్లనిపించింది. గుండె చేత్తో పట్టుకున్నారు. 'అలా నిర్లక్ష్యం చెయ్య వద్దు. నే నలాగే చేసి దెబ్బ తిన్నాను. నా మొదటి భార్య కలాగే వాంతులు వచ్చాయి. మామూలు వాంతులే అనుకుని నిర్లక్ష్యం చేశాను. ఇంటి పక్కవాళ్ళ

ఏదో నాటు మందు ఇచ్చారు. కలరా అని తెలుసుకొనే లోగానే చెయ్యిదాటి పోయింది ..."

మేనేజరు మవునంగా ఉండిపోయారు.

కోటిరెడ్డిగారు అలాగే వెనక్కు వాలి ఉన్నారు. ఆ కళ్ళు ఇటు అటు చూడటం లేదు. జరిగిపోయిన విషయాలను చూస్తున్నాయి. మెదడు వాటి గురించే ఆలోచిస్తోంది. అప్రయత్నంగా మాటలు వస్తున్నాయి.

"అప్పుడు నాకు ముప్పయి ఏళ్ళు. భార్యపోయినందుకు బాగా షాక్ అయిపోయాను. కొన్నాళ్ళు అన్నం, నీరూ ముట్టుకోలేదు. ఒక ఏడాది దాకా మనిషిని కాలేకపోయాను. మా వాళ్ళు నా పరిస్థితి చూసి మళ్ళీ పెళ్ళి చేసుకో మన్నారు. నాకు చేసుకో బుద్ధి కాలేదు. పదేళ్ళు అలాగే ఉండిపోయాను. ఆ తరవాత పెళ్ళి చేసుకున్నాను మళ్ళీ. చేసుకోకపోతే ఈ ఏళ్ళ వ్యయ ఏట వంటా వార్పూతో అవస్థ పడగలిగే వాడినా..." అని చెబుతూ ఆయన ఆగారు. చిన్న పిల్లవాడిలా తను తన సంగతులన్నీ చెప్పుకోను కుంటున్నట్లు గ్రహించి సర్దుకున్నారు. రెండు నిమిషాల ప్రయత్నంతో పూర్తిగా నిలవరించుకో గలిగారు.

మేనేజరు లేచి ఆ గుమాస్తా క్షేమం కనుక్కున్నాడు. అతని వాంతుల తీవ్రత తగ్గింది. రెస్టు తీసుకోమని, ఆ రోజు సెలవుగా కాకుండానే ఇంటికి పంపించేశాడు.

మళ్ళీ వచ్చి తన సీట్లో కూర్చుని, ఆ విషయం ఆయనకి చెప్పాడు.

"అది సరే. ఆ విషయం వదిలెయ్యండి. ఇప్పుడు పనిమీద వచ్చాను" అన్నారు కోటిరెడ్డిగారు.

ఆయనకు కాఫీ తెప్పించలేదన్న విషయం అప్పుడు గుర్తుకు వచ్చింది సీతాపతికి. 'బాయ్!' అని పిలిచి రెండు కాఫీలు తెమ్మన్నాడు.

"ఇంటర్వ్యూలు అయాయిటగా నిన్న?" అన్నారు ఆయన.

మేనేజరు కనుబొమలు ముడిపడ్డాయి.

"ఆ విషయంలోనే వచ్చాను."

మేనేజరు గాలి తీసిన బుడగలా అయిపోయాడు.

"ఎంతమంది వచ్చారు ఇంటర్వ్యూకు?"

"ఇరవై రెండు మంది."

"పోస్టు లెన్ని?"

"ఒక్కటి."

"నాకు తెలిసిన అబ్బాయి ఒకరు ఉన్నాడు" అన్నా రాయన మేనేజరు ముఖం పరిశీలిస్తూ. ఇంతకుముందు అతని ముఖంలో కనబడుతున్న ప్రసన్నత, ఉత్సాహం ఇప్పుడు లేదు. అతను ఆయన కేసి గౌరవంగా చూడటం లేదు. మొహంలో ఎక్కడో ఇబ్బంది పడటం కనిపిస్తోంది. అది దాచుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు. 'అలాగే చేస్తాను' అని కాని, 'మీరు స్వయంగా రావాలా?' అని కాని సీతాపతి అంటాడని ఇక్కడికి రాకముందు అనుకున్నా రాయన. అయినా పట్టించుకోలేదు.

"పేరు వ్రాసుకుంటారా?" అన్నారు ఆయన.

"చెప్పండి." అన్నాడు మేనేజరు సాధ్యమైనంత ప్రసన్నంగా కనిపిస్తూ.

"పి. రాజారావు బి. ఏ." అని ఇంకా చెప్ప



పూజకోసం ....

చిత్రం— ఇ. గోపాలరావు (గుంటూరు)

బోతుండగా, మేనేజరు చటుక్కున సీటులోంచి లేచాడు. 'ఉండండి ఇప్పుడే వస్తాను. కాఫీకి వెళ్ళిన వాడు ఇంకా రాడేమిటి?' అని హడావిడిగా బయటికి వెళ్ళాడు. అక్కడ ఉన్న బల్లమీద కేక వేశాడు. మొత్తానికి అయిదు నిమిషాలు అయాక రెండు కప్పుల కాఫీ పట్టుకొస్తున్న కుర్రవాడిని తీసుకొచ్చాడు. 'కాఫీ తీసుకోండి, సార్' అని కాఫీ కప్పు అందించి తను ఒకటి తీసుకున్నాడు. కాఫీ తాగుతున్నంతసేపూ వూపిరి తిరగకుండా కంపెనీ వ్యవహారాలు మాట్లాడాడు అనర్గళంగా. వినడానికి ఇంపుగా ఉండేటట్లు మాట్లాడాడు. ఆ వాక్చాతుర్యానికి కోటిరెడ్డి గారికి ఆశ్చర్యం వేసింది. వాటి వాళ్ళు వింటూంటే చాలు. హాయిగా ప్రవాహంలో సాగిపోయేటట్లు మాట్లాడటం కళ. అది అందరికీ ఉండదు. సీతాపతిని చూసినప్పుడు ఇంత చక్కగా మాట్లాడగలడని కోటిరెడ్డిగారు అనుకోలేదు.

కాఫీ అయిపోగానే 'అలాగే, సార్! మీరు స్వయంగా వచ్చి అడిగాక కాదంటానా? ఉద్యోగం తప్పకుండా ఇస్తాను. సార్! ఒక్క జరగంట ఇవి

నవ బరు 3 నుంచి కా ులు పారంభం!

1981 ఫి బవరి 2, 22 తేదీలలో

6 వ తరగతి లోనికి పవేశ రీక్షలు జకుగును.

సైనిక స్కూలు, కోరుకొండ (ఎ. పి.)

బాలుర వయస్సు 1981 జూలై 1వ తేదీ నాటికి 10-12 సం॥ల మధ్య నుండవలెను డిఫెన్సులోని ఎక్సుసర్వీసు ఉద్యోగుల, సర్వీసు ఉద్యోగుల పిల్లలకు మరియు షెడ్యూలు కులముల వారికి ప్రత్యేక రిజర్వేషన్లు కలవు

* కోరుకొండ సైనిక స్కూలుతో సమానముగా ప్రారంభించి. చక్కటి హాస్టల్ వసతితో పై పరీక్షలకు ఇంగ్లీషు మరియు తెలుగు మీడియంలో శిక్షణ నిచ్చుటలో పేరెన్నికగన్న దక్షిణ భారతదేశమునందలి ప్రప్రథమ విద్యాసంస్థ

ఫోన్ : 22084



శ్రీ విద్యా విహార్

"ఆదర్శ గురుకుల విద్యాసంస్థ"

లలితానంద నగర్, రింగ్ రోడ్,

గుంటూరు-522 006.

ప్రతి సంవత్సరం అత్యుత్తమ ఫలితాలకు, సైనిక స్కూలులో చదువు వందలాది మా విద్యార్థులే మీకు నిదర్శనం

ఇంగ్లీషు తెలుగు మీడియంలలో నర్సరీ నుండి . వ తరగతి వరకు క్లాసులు కలవు

SAVITA

ఉంది. మీరు ఆ పడక కుర్చీలో విశ్రాంతి తీసుకోవచ్చు" అంటూ హడావిడిగా బయటికి వెళ్ళాడు, ఎవరినో పిలుస్తూ.

'లేదులె నేను ఇంటికి వెడతాను' అంటూ అర గంట అక్కడ ఉండలేక వచ్చిన పని అయిన తృప్తితో లేచి వెళ్ళారు కోటిరెడ్డిగారు.

• • •

ఉద్యోగానికి వస్తుతః అర్హత లేని వ్యక్తికి తన మాట విలువ ఉపయోగించి ఉద్యోగం ఇప్పిస్తున్నాన్న బాధ కలిగింది. ఆయనకు. తను ఇంతకుముందు ఎప్పుడూ అలా చెయ్యలేదు. ఈనాడు వ్రతభంగం అయింది.

అందుకే ఆరోజు ఆ అబ్బాయి కనపడినప్పుడు అంత సంతోషంగా లేదు ఆయనకి. చెప్పాను ఈవేళో, రేపో అపాయింటుమెంటు ఆర్డరు వస్తుంది" అన్నారు. అతని మొహం వికసించింది. 'థాంక్స్, సార్! ఆర్డరు రాగానే మీకు కనపడతాను" అన్నాడు.

"అక్కర్లేదులే" అన్నారు కోటిరెడ్డిగారు కాని, కనపడాలనే మనసులో ఉంది.

అతను రెండురోజులు రాలేదు. తనను నిర్లక్ష్యం చేశాడని అనిపించింది ఆయనకు.

మూడవ రోజున వచ్చాడతను. చాలా విచారంగా ఉన్నాడు. "ఉద్యోగం నా కివ్వలేదు. ఇంకొకరెవరికో ఇచ్చేశారట" అన్నాడు.

కోటిరెడ్డిగారు నమ్మలేదు. 'నిజమా?!' అన్నారు.

'నిజమే, సార్! అందులో పని చేసే గుమాస్తా ఒకాయన కనిపించాడు. ఆయన చెప్పాడు అప్పాయింట్‌మెంట్ అయిపోయిందని!'

'నీకు పోస్టులో ఏం రాలేదా?'

'లేదండి.'

"ఇంకా వస్తుందేమో?'

'లేదండి. అభ్యర్థి స్వయంగా వచ్చి ఆర్డరు తీసుకున్నాడట.'

'ఎవరి కిచ్చారుట?' అన్నారు కోటిరెడ్డిగారు కోపంతో, విసుగుతో, అవమానంతో.

'పేరు గుర్తు లేదన్నాడు, సార్'

వెంటనే చెప్పులు వేసుకుని ఇంటికి ఎదురుగా ఉన్న హోటల్లోకి వెళ్ళి ఫోన్ తీసుకున్నారు. మేనేజరు లేడు. సెలవులో ఉన్నాడు. అసిస్టెంటు మేనేజరు పలికాడు.

'మొన్న ఇంటర్వ్యూ అయిన పోస్టుకు అపాయింటుమెంటు అయిందిటగా?'

'అయింది, సార్'

'ఎవరికిచ్చారు?'

'ఉండండి చూసి చెబుతాను.. ఆ... పి.రాజారావు బి.ఏ., సార్!'

కోటిరెడ్డిగారు ఆశ్చర్యంగా చూశారు. తనను రాజారావు తమాషా చేస్తున్నాడని పించి కోపం కలిగింది. ఫోన్ చేతో మూసి పక్కకు తిరిగి, 'నీకే ఇచ్చారంటున్నాడు?' అన్నారు రాజారావు కళ్ళలోకి చూస్తూ.

'ఒట్టు, సార్! మీ దగ్గిర ఎలా అబద్ధం చెబుతాను?' మళ్ళీ ఫోన్ తీసుకున్నారాయన.

'మీరు పేరు సరిగ్గా చూశారా?'

'చూశాను, సార్. పి. రాజారావు బి. ఏ.'

పి. రాజారావు బి. ఏ. కి అతను ఉద్యోగం ఇచ్చాననడం, ఇతను నేను అందుకోలేదనడం ఎలా సాధ్యం?'

అప్పుడు అనుమానం వచ్చింది ఆయనకు. అదేపేరు, అదే డిగ్రీతో ఇద్దరు ఎందుకు ఉండకూడదూ?

'అడ్రెసు ఏమిటి?' అని అడిగారు ఫోనులో.

అతను చెప్పాడు.

ఆయన అనుకున్నదే నిజం అయింది తన పక్కనున్న పి. రాజారావు బి.ఏ. అడ్రెసు అప్పాయింట్ మెంట్ అయిన పి. రాజారావు బి. ఏ. అడ్రెసూ వేరు.

మళ్ళీ ఫోనులో 'లిస్టు చూడండి. పి. రాజారావు బి.ఏ. అనే పేర్లు రెండు ఉన్నాయా?" అన్నారు.

అతను లిస్టు చూసి— 'ఆ. ఉన్నాయి, సార్! మీరు చెప్పిన అడ్రెసున్న కుర్రవాడి నంబరు ఇరవై ఒకటి. ఉద్యోగం వచ్చిన అబ్బాయి నంబరు పన్నెండు' అన్నాడు.

ఫోను పెట్టేసి, 'అక్కడ పొరపాటు జరిగిందన్న మాట' అని, 'నీకు అదృష్టం లేదోయ్. నేను సిఫార్సు చేసినా పని జరగలేదు' అన్నారాయన రాజారావు కేసి తిరిగి.

రాజారావు తన దురదృష్టాన్ని నిందించుకుంటూ వెళ్ళిపోయాడు.

* * * *

ఆలోచించగా జరిగిన దానిలో తాను బాధపడవలసిన దేమీ లేదని అనిపించింది ఆయనకు తను ఏనాడూ సిఫార్సులు చెయ్యలేదు. అరకంగా ఎవరైనా ఉద్యోగాలు సంపాదించడం తనకు. ఇష్టం లేదు. ఇప్పుడేదో ఈ కుర్రవాడు నాలుగు సార్లు తన చుట్టూ తిరిగాడని మెత్తబడి తన పలుకుబడి ఉపయోగించాడు. దైవికంగా అది తప్పింది.

ఆ తరవాత ఆ అబ్బాయి కనపడలేదు. తనకు పరపతి ఉన్నది ఈ ఒక్క కంపెనీలోనేనని, తను ఉద్యోగం వేయించగలిగితే ఇక్కడ మాత్రమేనని అతనికి తెలుసు. ఇంకెక్కడ అయినా ఉద్యోగాల ఖాళీలు వస్తే ఇంకెవరి సిఫార్సుకోసమయినా వాళ్ళను ఇంద్రుడనీ, చంద్రుడనీ పొగుడుతూ ఉంటాడు. కోటిరెడ్డిగారికి చిరాకు వేసింది, అలా ఆలోచించుకుంటూ ఉంటే.

"లలితా !" అని పిలిచాడు ఆయన.

"ఆఁ!"

"ఆ అబ్బాయి తరవాత వచ్చాడా మన ఇంటికి?"

"రాలేదు."

"రాడు. ఎందుకు వస్తాడు?" అని గొణుక్కున్నారు. ఇంతలో పోస్ట్ అని వినపడింది.

లలితమ్మ పోస్టుమన్‌కు ఎదురు వెళ్ళింది. వచ్చినవి ఒక ఉత్తరం, ఒక బుక్ పోస్టు. బుక్ పోస్టులో ఏదో కథల పత్రిక వచ్చింది. తను పోస్టు ద్వారా ఏ పత్రికా తెప్పించుకోడు. ఈ పుస్తకం ఎందుకు వచ్చింది? అనుకున్నా రాయన.

**FREE !** **ముత్యాల సరాలు** **ఉచితం !**

## ప్రభువు స్పర్శ

శిల్పకళలో ఆ శిల్పి ప్రవీణుడు అయినా ఒక ఖరీదయిన పాలరాయి మీద తన పనితనం ఆరంభించాడు. శిల్పకళలో ఆరితేరిన వాడు కాదు కాబట్టి తన పని ఆరంభించాడే కాని దానిని ఎలా పూర్తి చేయాలో తెలియక అంత విలువ గల పాలరాయిని పాడుచేసి అసంపూర్ణముగా దానిని విడచి వెళ్ళిపోయాడు. ఇటలీ దేశమునకు చెందిన ఫ్లారెన్సు అనే పట్టణములో నున్న ఒక పెద్ద క్రైస్తవ దేవాలయపు ఆవరణములో ఆ రాయి ఎండకు ఎండి వానకు తడిసి ఒక వంద సంవత్సరాల కాలము పడి ఉంది. శిల్పకారు లనేకులు దానిని చూచి ఇంక దానిని బాగుపరచటం అసాధ్యమని తలచి వెళ్ళిపోయారు. అయితే మైకలాంజిలో అనే ఒక సుప్రసిద్ధ శిల్పకారుడు బ్రహ్మాండమైన ఆ పాలరాయిని చూడటం తటస్థించింది. ఆ శిల్పి ఆ రాయిని అన్ని కోణాల నుండి పరీక్షించి దాని కొలతలన్నీ తీసికొని ఇంతకు పూర్వం తెలివి తక్కువ శిల్పకారుడు చేసిన లోపములను గుర్తించి దానిని అతి జాగ్రత్తగా పరిశీలించి నపుడు అతనికి ఆ పాలరాతిలో మహా భక్తుడైన గొర్రెలకాపరి దావీదు స్వరూపం చూచాయగా గోచరించింది. దానిని మనస్సులో వుంచుకొని మైకలాంజిలో పాలరాతి మీద తన పనిని ప్రారంభించాడు. ఎంతో నేర్పుతో, నిశ్చలత్వముతో దానిని రూపొందిస్తూ మూడు సంవత్సరాలు కఠిన దీక్షతో పని చేసిన పిమ్మట అది మనోహర రూపముతో చక్కని విగ్రహముగా రూపొందింప బడినది. పద్దెనిమిది అడుగుల ఎత్తుతో, తొమ్మిది టన్నుల బరువుతో వున్న ఆ విగ్రహాన్ని నిలబెట్టినపుడు ఒక విద్యార్థి ఏమన్నాడంటే "దీనిలో ఒకటే కొదవ. అది ఏమిటంటే నోటి మాటలు."

బుద్ధిహీనుడైన శిల్పకారుడు పనికిమాలినదని వదిలి వేసిన పాలరాతిని మహా గొప్ప శిల్పి మైకలాంజిలో నేర్పుతో, ఓర్పుతో ప్రావీణ్యతతో, చూచిన వారంతా ఆశ్చర్యచకితు లగునట్లు దానిని అపురూపమైన శిల్పఖండంగా రూపొందించాడు. ఇంతకన్న గొప్ప పనులు చేయు దివ్య శిల్పి మరొకడున్నాడు. ఆయన నిర్జీవమైన రాతిమీద పని చేయడు గాని, సజీవులైన మానవ హృదయాల మీద పనిచేస్తూ సాతాను మోసము వలన అథోగతి పాలై, శిథిలమై పోయి, ఎవ్వరికీ ఎందుకూ పనికిరాని బండరాళ్ళ వంటి మానవ హృదయాలను ప్రేమతో, కృపతో తన దివ్య స్వరూపము లోనికి తీర్చి దిద్దుచున్నాడు. అపరాధముల చేతను, పాపముల చేతను తన దైవస్వరూపాన్ని పోగొట్టుకొన్న మానవుడు తన పాపపు స్వభావము నుండి విడుదల పొంది తిరిగి దేవునితో సహవసించాలంటే ఆ వ్యక్తిలో, ఒక గొప్ప మార్పు జరిగి తీరాలి. పాపరహితుడైన ప్రభువు స్పర్శలో తప్ప ఆ పని జరుగదు. పాపములో ఆత్మీయంగా మరణించిన వారిని పవిత్రులుగాచేసి, వారికి నూతన జన్మమును ప్రసాదించే క్రీస్తుయొక్క పవిత్ర శక్తిని గురించి తెలుసుకొన్నారా ?

-చదలవాడ చంద్రమతీదేవి

**ఉచితం !!** **ఉచితం !!!**

కరుణామయుడైన యేసుక్రీస్తు జీవిత చరిత్ర, మానవాళికి ఆయన చేసిన కమనీయ బోధలు తెలిపే అందమైన పుస్తకం ఉచితంగా పొందదలచుకుంటే మీ చిరునామా ఈ రోజే మాకు వ్రాయండి. పోసు ఖర్చులు మేమే భరించి ఉచితంగా మీకు పుస్తక పంపుతాము

ఫార్ కార్నర్స్,
పోస్టు బాక్సు నెం. 35
ఖైరతాబాద్,
హైదరాబాద్-4

**FAR CORNERS.**

**GOSPEL MESSAGE INSERTED BY FAR CORNERS.**







పేరు చూశారు కూరు మీద. కె. కోటిరెడ్డి అని ఉంది.

"ఇలా ఇవ్వండి. నేను చదివి మీ కిస్తాను" అంటూ తీసుకోబోయింది లలితమ్మ.

"ఉండు. సరిగ్గా చూడనీ" అంటూ అడ్రెసు చూశారు. అడ్రెసు వేరు. ఆ వీధిలోనే ఎవరో చదువుకునే స్టూడెంటుది. వెళ్ళి ఎప్పుడో పోస్టు మన్‌ను పిలిచి ఇచ్చేశారు ఆ పుస్తకం.

"పోనీ, ఉంచితే నేను కథలు చదువుకునే దాన్నిగా?" అంది లలితమ్మ.

ఆదెవరిదో కదు టే?"

మీ పేరే కదండీ ఉన్నది? మనదే ననుకుని చదివేసి ఆనక పొరపాటని చెప్పి ఇచ్చేస్తే సరి పోయేదిగ?" అంది లలితమ్మ నవ్వుతూ.

కాని, అడ్రెసు వేరుగా?" అంటూండగానే ఆయన మెదడులో ఏదో మెరిసింది. నిమిషం తీవ్రంగా ఆలోచించారు. తను సిఫార్సు చెయ్య డానికి వెళ్ళినప్పుడు మేనేజరు ప్రవర్తన అప్పుడు అసహజంగా తోచలేదు కాని, ఇప్పుడు అనుమానం రేకెత్తిస్తూంది.

నేను వూహించినది కరెక్టు అయితే నువ్వు చాలా తెలివైనవాడివి, సమయస్ఫూర్తి గలవాడివి, మేనేజర్ ! దైవికంగా కలిసివచ్చింది. ఉపయో గించుకున్నావు" అనుకున్నారు. కుతూహలంకొద్దీ ఆ సాయంత్రమే ఎంక్వైరీ చేశారు. నవ్వు కున్నారు. పాదరసంలాంటి సీతాపతి చురుకు దనాన్ని మనసారా మెచ్చుకున్నారు.

2

మేనేజరు సీతాపతి సిగరెట్టు ఆఖరి దమ్ములాగి కిటికీలోంచి పారేసి, ఒరేయ్ ! నిన్ను ఈ ఇంటికి ఇప్పట్లో రావద్దన్నానా?' అన్నాడు మేనల్లుడు రాజారావు కేసి తిరిగి.

అదికాదు, మావయ్యా! వసంత రమ్మంది కాలేజీకి అప్లికేషన్ ఫారమ్ పూర్తి చేసిపెట్టాలి అని రమ్మంది !

"నేను ఉన్నానుగా ? నువ్విలా రోజు కొకసారి ఇక్కడికి వస్తే నువ్వు నా మేనల్లుడివన్న సంగతి, నేను నీకు ఉద్యోగం ఇచ్చిన సంగతి అందరికీ తెలిసిపోదూ?

"తెలిస్తే ఏం, మావయ్యా?"

"తెలియకూడదు లే. తెలిసినా పరవాలేదను కుంటే నిన్నూ ఇక్కడే ఉండమనేవాడినిగా? నీ కెందుకు అవన్నీ? చెప్పినట్టు విను. ఆ రూము లోనే ఉండు కొన్నాళ్ళపాటు. ఇక్కడికి రాకు !

"అలాగే మరి, వసంత అడ్మిషను సంగతి?"

"నేను చూసుకుంటాలే."

"ఇప్పటినుంచీ బాగా ప్రయత్నించాలి, మావయ్యా! ప్రతి ఏడాదిలాగ కాదు. ఈ ఏడు ఎక్కువమంది పాసయ్యారు. కాలేజీ సీటు దొరకడం చాలా కష్టం."

ఇంతలో వసంత వచ్చింది. ఆమె సీతాపతి కూతురు. పదిహేనేళ్ళు ఉంటాయి. హైస్కూలు చదువు పూర్తి చేసింది. పబ్లిక్ పరీక్షల గండం గడిచి సరిగ్గా పాస్ మార్కులతో క్షేమంగా రాలాయింది.

అప్లికేషన్ ఫారం పూర్తిచేసి ఆ రోజే రిజి

ప్రేషన్ చేయించి వచ్చాడు సీతాపతి. అడ్మిషన్లు రెండు రోజుల్లో ప్రారంభం అవుతాయనీ, పేపర్లు లీక్ కావడం వల్ల కాబోలు చాలా మంది పాసయ్యారనీ, అప్లికేషన్లు చాలా వచ్చాయనీ, సీటుదొరకడం చాలా కష్టం అనీ చెప్పారు ఆయనకు. ఎవరైనా తెలిసిన వాళ్ళు ఉంటే పని జరగవచ్చునని కూడా చెప్పారు.

ఆ విషయం సీతాపతి ఆలోచించ పోలేదు. ఆయన కొక ఆధారం ఉంది.

ఆ వుమెన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ఆయనకు ఒక రకంగా పరిచయం. అదొక రకమైన పరిచయం. తెలుసుననడానికీ లేదు. తెలియ దనడానికీ లేదు. ఆవిడ తనను గుర్తు పట్టుకుంటే మంచి పరిచయం కిందే లెక్క.

ఒకసారి ఆవిడా, ఆవిడ ఎనిమిదేళ్ళ కొడుకూ సీతాపతి ప్రయాణం చేస్తున్న బస్సులో ప్రయాణం చేస్తున్నారు. బస్సు ప్రమాదానికి గురి అయింది. సీతాపతికీ, ఆవిడకీ చెప్పుకోదగ్గ దెబ్బలు తగలలేదు. కాని, ఆ పిల్లవాడికి తగిలాయి. ప్రమాదం జరిగిన చోటు నుండి ఆరమైలు వరకూ ఊరు లేదు. ఆ అరమైలూ ఆ కుర్రవాడిని మోసుకు వెళ్ళి ప్రాథమిక వైద్యం చేయించి తరవాత తన ప్రయాణం కొనసాగించాడు. ఎవరైనా ఆవిడకి ఆ సహాయంచేసి ఉండేవా రేమో కాని, ఆ సహాయం అతను చేశాడు.

తరవాత ఆవిడ ఒక సారి రిక్షాలో వెడుతూంటే చూసిగుర్తు పట్టాడు. కాని, పలకరించడానికి ధైర్యం చాలలేదు. అప్పటి సంఘటను, తను చేసిన చిన్న సహాయం ఆవిడకి గుర్తున్నాయో, లేదోనని అనుమానం.

ఇప్పుడు సీతాపతికి ఆవిడను తప్పకుండా కలుసుకో వలసిన అవసరం వచ్చింది. ఆమె తనను గుర్తుపడితే అదృష్టమే అనుకున్నాడు. సంకోచిస్తూనే వెళ్ళాడు.

ఆవిడ సీతాపతిని గుర్తు పట్టింది. అయితే పని ఒత్తిడి మీద ఎక్కువ మాట్లాడలేక పోయింది. సీతాపతి కూడా అంత హోదా ఉన్న వ్యక్తి ముందు చాలా చిన్నవాడి ననిపించింది. మాటలు సరిగ్గా రాలేదు. ఆవిడ కుర్చీలో కూర్చోమంటే కూర్చో లేదు. ఆవిడ తనను గుర్తు పట్టక పోతే అసలు అక్కడ క్షణం కూడా ఉండగలిగే వాడు కాదు. అప్పుడు బస్సులో ఆవిడను ఒక అబలగా, కొడుకును గురించి ఆందోళన పడ్డ తల్లిగా చూశాడు. ఇప్పుడు హుందాగా, టీవిగా కుర్చీలో కూర్చుని పుర ప్రముఖులతో సమాన స్థాయిలో చర్చలు చేస్తూ, ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడుతున్న ప్రిన్సిపల్ త్రిపుర సుందరి గారికీ, ఆ నాటి అబలకీ ఎక్కడా సామ్యం లేదు.

తడబడుతూ తను వచ్చిన పని చెప్పాక తప్పకుండా సీటు ఇస్తానంది. పేరు అడిగి తన ముందు నోట్ బుక్కులో 'కె. వసంతకుమారి' అని నోట్ చేసుకుంది. క్లర్కుకు చెబుతాను అంది.

ఇంతలో ఆ ఊరి చెయిర్మన్‌గారు, ఎం. ఎల్. ఎ. లోపలికి అడుగు పెట్టడం చూసి సీతాపతి లేచాడు. ప్రిన్సిపాల్‌కి థాంక్స్ చెప్పి బయట పడి ఊపిరి పీల్చుకున్నాడు. ప్రిన్సిపల్ గదిలో ఉన్నంతసేపూ తనొక చీమనో, దోమనో అనిపించింది. ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు.

"ఈ రోజు వేళావిశేషం మంచిది. క్షణం తీరిక లేని ప్రిన్సిపల్‌తో తనకు రెండు క్షణాలు ఏకాంతం దొరకడం కేవలం తన అదృష్టం. మరెవరైనా ఉన్నప్పుడు మాట్లాడడానికి ఇబ్బంది పడే విషయం తనది."

* * * *

కాలేజీ నుంచి తిన్నగా కంపెనీకి వెళ్ళేసరికి ఒక దుర్వార్త తెలిసింది. ఆ రోజు కోటిరెడ్డి గారు సీతాపతి దగ్గరికి వచ్చినప్పుడు వాంతులు వచ్చిన గుమాస్తా హాస్పిటల్లో చచ్చిపోయాడు. అయితే కారణం కలరా కాదు. హార్ట్ ఎటాక్ వచ్చింది. గుండె పోటు రావటం, హాస్పిటల్లో చేర్పించటం, అతను చచ్చిపోవడం గంటసేపు తేడాలో జరిగిపోయాయి.

అతడి కుటుంబానికి పరిహారం ఇవ్వటం, ప్రావిడెంటు ఫండు లెక్కలు తేల్చడం, కంపెనీ కట్టుతున్న అతని ఇన్స్యూరెన్సు వ్యవహారాలు చూడటంలో మునిగిపోయాడు సీతాపతి.

ఆ గుమాస్తా ఉద్యోగం ఖాళీ అయింది. గుమాస్తాలు తక్కువ కావటం వల్ల అది వెంటనే భర్తీ చెయ్యవలసిన అవసరం కూడా ఏర్పడింది.

ఆ ఖాళీలో ఎవరిని వెయ్యాలనే విషయంలో సీతాపతి ఆలోచించలేదు. టైపిస్టును పిలిచి కోటిరెడ్డి గారు చెప్పిన పి. రాజారావు బి. ఎ. పేరిట అపాయింటుమెంటు ఆర్డరు టైపు చేయించాడు. మర్నాడు పోస్టు చెయ్యమని చెప్పాడు.

ఆ రోజు ఫస్టు తారీకు. జీతాలు తీసుకుని మధ్యాహ్నం ఇంటికి వెళ్ళినప్పుడు కూతురికి కాలేజీ ఫీజుకు సరిపడా డబ్బు ఇచ్చి, 'నువ్వెళ్ళి కట్టేయి. నేను రావడానికి టైములేదు' అని చెప్పాడు.

గంటన్నర పోయాక వసంత తిన్నగా కంపెనీకి వచ్చింది. 'నన్ను చేర్చుకోలేదు, నాన్నా! నాకు సీటు ఇవ్వలేదు' అంది ఏడుపు వినపోగా.

సీతాపతికి అర్థం కాలేదు. ప్రిన్సిపాలు సీటు ఇస్తానని స్వయంగా చెప్పి, పేరు కూడా నోట్ చేసుకున్నాక సీటు ఎందుకు లేదు? ఏం జరిగిందో, ఎలా జరిగిందో తెలుసుకు వద్దామని తిన్నగా కాలేజీకి బయలుదేరాడు కూతుర్ని తీసుకుని.

ప్రిన్సిపాల్ త్రిపుర సుందరి గారు ఎవర్నో సాగ నంపడానికి వరండాలోకి వచ్చింది. అంత హడావిడి లోనూ సీతాపతిని గమనించింది.

"ఏమండీ! మీ అమ్మాయికి ఎల్లుండి నుంచి క్లాసులు ఉంటాయి. కాలేజీ మానకుండా రెగ్యులర్‌గా రావాలి" అంది లోపలికి పోతూ.

సీతాపతి క్షణం తటపటాయించి—"అసలు జీతం కట్టుకోలేదండి. సీట్లు లేవన్నారుట" అన్నాడు.

వెనక్కు తిరిగి—'అరె!' అందావిడ ఆశ్చర్యంగా. 'మీరు మా గుమాస్తాకి చెప్పావే ప్రత్యేకంగా?' అంటూ ప్యూన్‌ను పిలిచి 'కె. వసంతకుమారి అని తను పేరిస్తే ఆ అమ్మాయికి జీతం ఎందుకు కట్టుకోలేదో' కనుక్కు రమ్మంది. వాడు వెడుతూంటె మీరుకూడా వెళ్ళి కనుక్కోండి అంది సీతాపతితో.

సీతాపతి ఆఫీసు గుమ్మం దగ్గర నించున్నాడు. ప్యూను లోపలికి వెళ్ళి కనుక్కు వచ్చాడు.




దేహపుష్టికి
ఆరోగ్యానికి
పండిత డి.గోపాలాచార్యుల వారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17.

దీర్ఘవ్యాధులకు ఉత్తమ వైద్యం!

దురభ్యాసములకులోనై దాంపత్య సౌఖ్యం పొంద లేనివారు, హెర్నియా. చర్మవ్యాధులకు బొల్లు ద్వారా వరిబీజము (బుడ్డ). మూత్రవ్యాధులు, ఇస్నోఫీలియా, దమ్ము, ఉబ్బసమునకు ఆపరేషన్ లేకుండ రండి.
డా॥ దేవర,
5/1, బ్రాడిపేట, గుంటూరు-2
బ్రాంచి: ఏార్యాడిగుడి వద్ద, తెనాలి. ఫోన్: 551

ఇంకా పొడుగు ఎదగండి
2" – 8"

నూతన శాస్త్ర పద్ధతులలో వ్యాయామములతో ఎక్కువ పొడుగుకండి. ఆరోగ్యవంతులు కండి. స్త్రీ పురుషులకు ఎల్లరకు అనువైనది. దీని వంటి కోర్సు, లేక పుస్తకం మరొకటి ఎంత మాత్రం లేదు. వివర ... గాని తెలుగులో గాని ఉచితం
NEW C. T. HOSPITAL
806, Dr Mukerjee Nagar, Delhi-9.

స్క్రీన్ చదవండి

సుప్రసిద్ధ సినీ వార పత్రిక







చర్మాన్ని తెల్లబరిచే
ప్రత్యేక మైనది
చర్మ వైద్యులు మరియు సౌందర్య
సలహాదారులచే ఆమోదించబడింది




అందంగా, తెల్లగా, కోమలంగా ఉండాలని మీరు కలలుకనే ముఖ వర్చస్సు పొందండి. ఫ్లోరోజోన్ లోని తెల్లపరిచే నిగూఢ రహస్యం పైపై మెరుపు కలిగిస్తుంది. శుభ్రపరుస్తుంది. చర్మపోషకం మరియు టానిక్, ఫ్లోరోజోన్, మొటిమలు, ముడుతలు, మచ్చలను సాఫీచేసి జారిపోయిన చర్మానికి నవ్యరూపం ఇస్తుంది.

ఫ్లోరోజోన్

కాన్సంట్రేటెడ్ క్రీమ్ & లోషన్
హైజీనిక్ రిసెర్చి ఇనిస్టిట్యూట్
పోస్టు బాక్సు 1192, బొంబాయి 400 001
ప్రముఖ కెమిస్టులు & దుకాణాలలో లభిస్తుంది

national-893 Tel


కె. వసంతకుమారి అనే అమ్మాయి ఎడ్మిట్ అయిపోయిందిట! వాళ్ళ నాన్నగారు కోటిరెడ్డిగారు స్వయంగా జీతం కట్టారట. 'మా అమ్మాయికి వసంతకుమారికి సీటు వచ్చిందా?' అని అడిగారని, పేరు ఒకటే అయినందువల్ల పొరపడి వచ్చిందని చెప్పగానే జీతం కట్టి వెళ్ళిపోయారని చెప్పాడు.

సీతాపతి దిగ్గ్రమతో చూశాడు. తన కూతురికి రావలసిన సీటు పొరపాటున కోటిరెడ్డిగారి కూతురికి వచ్చిందా?!

సీట్లు అయిపోయాయనీ, ఇంక చేసేదేమీ లేదనీ తెలుసుకున్నాక హతాశుడై నీరసంగా బయటికి వచ్చాడు సీతాపతి. కోటిరెడ్డిగారు తనకు పి. రాజారావు ఇంటిపేరు అడ్రెసు ఇవ్వనప్పుడు తను ఆ పరిస్థితిని తనకు అనుకూలంగా వినియోగించుకున్నాడు. పొరపాటులా కనిపింప జేసి తన మేనల్లుడికి ఉద్యోగం ఇప్పించుకున్నాడు. ఇప్పుడు తను కె. వసంతకుమారి అని ఇంటి పేరు పూర్తిగా ఇవ్వక పోవడం వల్ల దైవికంగా తను నష్టపోయాడు. తన అతి తెలివే తన కిలా దెబ్బ కొట్టిందని అనిపించింది అతనికి. స్వార్థం చూసుకుని ఎవరికో అన్యాయం చేస్తే ఇలాగే జరుగుతుందని అనిపించింది.

'ఏమన్నారు, నాన్నా?' అంది బయట బెంచీ మీద కూర్చున్న వసంత. ఏం చెప్పాలో తెలియలేదు సీతాపతికి. తను కూడా ఆమె పక్కనే బెంచీమీద కూర్చున్నాడు. తల తిరుగుతూన్నట్లు, కడుపులో వికారంగాను ఉన్నట్లు అనిపించింది. టెన్షన్ వల్ల లావ తిన్న అన్నం అరగలేదు. కొంచెం పక్కకు వెళ్ళి భళ్ళున వాంతి చేసుకున్నాడు.

గేటు దగ్గర ఉన్న జవాను 'ఏమిటి, బాబూ?' అంటూ వచ్చాడు. 'ఏం లేదు. వాంతి అయింది. సోడా తీసుకు రాగలవా?' అన్నాడు నీరసంగా.

కిళ్ళీ కొట్టుకు వెళ్ళి సోడా తెచ్చాడు. ఈలోగా మరో రెండు వాంతు లయ్యాయి.

డాక్టరు దగ్గరికి వెళ్ళండి, బాబూ! కలరా ఏమో? అన్నాడు జవాను దూరంగా నిలబడి సోడా అందిస్తూ.

కలరానా?" అనుకున్నాడు భయంగా సీతాపతి. సోడా తాగుతూంటే అంత నీరసంలోనూ ఆ రోజు కోటిరెడ్డిగారు తన దగ్గరికి వచ్చినప్పుడు సుమా స్తకు వాంతులు రావటం కలరా ఏమోనని ఆయన భయపడటం. నిర్లక్ష్యం చెయ్యవద్దని అనటం, తన నిర్లక్ష్యం వల్ల తన భార్య కలరా వాతబడి మరణించిందని చెప్పటం, మిగతా సంభాషణలు అన్నీ గుర్తుకు వచ్చాయి.

హటాత్తుగా సీతాపతి కళ్ళలో వెలుగు వచ్చింది. మొహంలో జీవకళ వచ్చింది. శరీరంలో సత్తువ వచ్చింది. అంత నీరసంలోనూ లేచి నిటారుగా నిలబడ్డాడు. సిగరెట్టు ముట్టించుకుని తృప్తిగా పొగ పీల్చి, "కలరా!" అని చిన్నగా నవ్వుకున్నాడు. "గుడ్ స్పోర్ట్స్, సార్! బ డిజర్వ్ దిస్ షార్ట్ మెంటల్ ఏగొనీ!" అనుకున్నాడు నవ్వుకుంటూ.

సోడా నీటితో మొహం కడుక్కుని జవానుకు రూపాయి ఇచ్చి, "ఒక్క విషయం చెప్పు. కోటిరెడ్డిగారు నీకు తెలుసా?" అన్నాడు.

"తెలుసండి."

"ఇక్కడికి ఇంతకుముందు వస్తూ ఉండేవారా?"

"అప్పుడప్పుడు వస్తూనే ఉంటారండి. అమ్మ గారితో మాట్లాడి పోతుంటారండి!"

"అమ్మగారికి ఆయన తెలుసా?"

"తెలియడం ఏమిటండి? ఆయన అమ్మగారికి వరసకు అన్నయ్య అవుతారటండి."

సీతాపతి నవ్వాడు. "ఇలాంటి దేదో ఉండాలని అనుకున్నాను" అన్నట్లుంది ఆ నవ్వు.

పక్కనే ఉన్న వసంత—"నాన్నా! నేను కాలేజీలో చేరడానికి వీలు లేదా?" అంది దిగులుగా.

"రేపు చేరుదువుగాని. రేపు జీతం కట్టి ఎల్లుండి నుంచి క్లాసులకు వెడుదువుగాని" అన్నాడు ధీమాగా.

వసంత చటుక్కున తల ఎత్తి చూసింది. "నిజం గానా?" అంది.

"నిజం" అన్నాడు సీతాపతి ప్రేమగా.

సీటు లేదని ప్రిన్సిపలు చెబుతూంటే తండ్రికి అంత ధీమా ఎక్కడిదో వసంతకి అర్థం కాలేదు.

కాని, తండ్రి "చేస్తాను" అంటే చేశాడన్న మాటే.

ఎలా? అన్న సందేహం తీరలేదు వసంతకు.

"ఇప్పుడే ఒక అర గంటలకి నీకు సీటు ఇప్పిస్తాను. నాతో రా" అన్నాడు సీతాపతి.

వసంత తండ్రిని అనుసరించింది.

## 3

పి. రాజారావు బి. ఏ. పేరిట టైపు అయిన అపాయింట్‌మెంట్ ఆర్డరు ఫైలులో పెట్టుకుని కోటి రెడ్డిగారి ఇల్లు కనుక్కుని ఇంటి తలుపు తట్టాడు సీతాపతి.

లలితమ్మ తలుపు తీసింది. కొత్త మనిషిని చూసి లోపలికి రమ్మని చెప్పి వెంటనే ఇంట్లోకి వెళ్ళిపోయింది సీతాపతి కూతురుతో లోపలికి వచ్చి కూర్చున్నాడు.

"ఎవరు వచ్చారు?" అన్నారు కోటి రెడ్డిగారు లోపలి గదిలో.

"ఇప్పుడు వచ్చిన దెవరో తెలియదు. పొద్దున్న మాత్రం ఆ ఉద్యోగం కోసం వచ్చిన రాజారావనే అబ్బాయి వచ్చి వెళ్ళాడు."

"అతను వచ్చాడా మళ్ళీ? ఎందుకుట?"

'ఏమీ లేదు. కనిపించి పోదామని వచ్చాను అన్నాడు.' కోటి రెడ్డిగారికి తృప్తి కలిగింది. అతనంటే సద్భావం కలిగింది. తను ఇతనికి ఉద్యోగం ఇప్పించ గలిగి ఉంటే బాగుండు ననిపించింది. కేవలం తను అతని కోసం ప్రయత్నించినందుకు కృతజ్ఞతతో కనిపించిపోదామని వచ్చాడు. ఆ ప్రవర్తన ఉన్న వ్యక్తి సహాయం చెయ్యదగ్గ వాడు.

ఆయన భుజంమీద కండువా వేసుకుని హాలులోకి వచ్చేసరికి సీతాపతి లేచి నించుని, "నమస్కారం, సార్!" అన్నాడు. వసంత కూడా నమస్కారం పెట్టింది.

"నమస్కారం" అన్నారు కోటి రెడ్డిగారు.

"మీతో ఒక విషయం మాట్లాడాలని వచ్చాను".

"మాట్లాడండి."

"మా అమ్మాయికి కాలేజీ సీటు కోసం ప్రిన్సిపలు గారిని అడిగితే ఒప్పుకున్నారు కాని, పేరు ఒకటే కావడంవల్ల ఆ సీటు పొరపాటున మీ అమ్మాయికి ఇచ్చారని తెలిసింది. మా అమ్మాయికి సీటు మీరే ఇప్పించగలరని తెలిసి వచ్చాను" అన్నాడు సీతాపతి.

"నేనా? నేనేం ఇప్పించగలను? ఈ ఏడు ఉద్యోగం కన్నా కాలేజీ సీట్ కష్టంగా ఉంది. అయినా, ఉద్యోగమే ఇప్పించలేని వాడిని ఇదేం ఇప్పించగలను?"

"మీరు కోప్పడవద్దు. అప్పుడెదో నా మేనల్లుడన్న మమకారంతో చేశాను. ఇప్పుడు మీ ఇష్టం పాటించే అవకాశం వచ్చింది" అంటూ కంపెనీలో ఉద్యోగి మరణంవల్ల ఉద్యోగం ఖాళీ అయిన సంగతి చెప్పి, "మీరు చెప్పిన అభ్యర్థికి ఉద్యోగం ఇస్తున్నాను" అంటూ తను పి. రాజారావు బి. ఏ. పేరిట ఇచ్చిన ఎపాయింట్‌మెంట్ ఆర్డరు ఆయన చేతిలో పెట్టాడు. ఆయన ఆర్డరులో పేరు, పేరుతోబాటు అడ్రెసు చూసి తల పంకించి తృప్తిగా నవ్వాడు.

"అవునా—నేను ఏం చెయ్యగల నిప్పుడు? కాలేజీ సీట్లు అన్నీ అయిపోయాయి గదా? మళ్ళీ ఏడాది గడిస్తేగాని సీట్లు రావు."

"మీ అమ్మాయిని చదువు మానిపించి ఆ సీటు మా అమ్మాయికి ఇస్తారని ఆశతో వచ్చాను" అన్నాడు సీతాపతి.

వసంత ఉలిక్కిపడి తండ్రి కేసి చూసింది. సీతాపతి గొంతులో అర్థింపు లేదు. దీనత్వం అసలే లేదు. రిక్వెస్టు చేస్తున్న ధోరణి అంతకన్నా లేదు. పెదవుల మీద మందహాసం తొణికిసలాడుతూంది.

"ఇదేనా అడిగె పద్ధతి?' అన్నట్లు తండ్రికేసి చూసింది సీతాపతికూతురు.

"నేను ఒప్పుకోవద్దా? మా అమ్మాయిని మానిపించి మీ అమ్మాయికి ఇస్తానని ఎలా అను కున్నారు?' అన్నారు కోటిరెడ్డిగారు బింకంగా.

"మీ అమ్మాయికి కాలేజి సీటు దేనికి? అక్కర్లేదు లెండి" అన్నాడు సీతాపతి తేలికగా నవ్వుతూ.

వసంతకు గాభరా ఎక్కువ అయింది. తండ్రి ధోరణి అర్థం కావడం లేదు. హెచ్చరించడానికి ఆమె తండ్రి చేతిని గట్టిగా గొక్కింది. ఫరవా లేదన్నట్లు చూశాడు సీతాపతి.

అంతవరకు అనుమానంగా చూస్తున్న కోటి రెడ్డిగారు నవ్వారు. పట్టుబడి పోయినట్లు తెలిసింది ఆయనకు. అయితే సీతాపతి క్షణాల మీద ఎలా తెలుసుకున్నాడో అర్థం కాలేదు. సీతాపతి అ...కు వచ్చాడని తనకు ఫోన్ వచ్చి ఇంకా అరగంటకాలేదు. ఈ కాస్త వ్యవధిలో సీతాపతి కరెక్ట్ ఆన్సర్‌తో ఎలా రాగలిగాడు.

"అయితే తెలిసిందన్నమాట—ఎవరు చెప్పారు?"

"మీరే" అన్నాడు సీతాపతి.

ఈ మాట కోటిరెడ్డిగారి ఆశ్చర్యానికి అంతు లేదు.

"నేను చెప్పానా? ఎప్పుడు?"

"మా ఆఫీసుకు రాజారావుకు సిఫార్సు విష యంలో మీరు వచ్చినప్పుడు."

"అప్పుడు నేను ఆ మాట అన్నానా?!"

"ఆరోజున మా ఆఫీసులో ఒకతనికి కలరా లాగా వాంతులు వచ్చినప్పుడు మీ భార్యగారికి కూడా అలాగే కలరా వచ్చి మీ ముప్పయ్యవ ఏట ఆవిడ మరణించారని చెప్పారు.

"చెప్పాను రైటే. అందులో క్లూ ఏముంది?"

"ఆ తరవాత పెళ్ళే చేసుకోకుండా పదేళ్ళున్నానని ఆ పైన పెళ్ళి చేసుకున్నానని అన్నారు.

"అన్నాను అందులో మాత్రం క్లూ ఏముంది?"

"మీకిప్పుడు సరిగ్గా ఏభై వ ఏడు. ఆ మాట కూడా అప్పుడే అన్నారు."

"అన్నాను అయితే?"

"అన్నీ కలిపి చూశాను. మీకు కాలేజీ చదివే వయసు గల కూతురు ఉండటానికి వీలులేదు" అన్నాడు సీతాపతి.

సీతాపతి తెలివికి ముగ్ధుడై పోయాడు కోటిరెడ్డి గారు "శభాష్ నిన్ను మనసారా రెండవసారి మెచ్చు కుంటున్నాను. రెండుసార్లూ నాకు ఆశ్చర్యంతో మతి పోయేటట్లు చేశావు. రేపే మీ అమ్మాయిని కాలేజీలో చేరమను. ఇంక చేర్పేసుకోవచ్చని సుందరికి చెబుతాను" అన్నారాయన నవ్వుతూ. మేనేజరు సీతాపతి కూడా శ్రుతి కలిపాడు.

అప్పుడే ప్రిన్సిపాల్ త్రిపుర సుందరి కారులో దిగింది. ఇద్దరు పి. రాజారావు బి. ఏ. లూ కూడా వచ్చారు కాకతాళీయంగా.

వాతావరణం అంతా హాయిగా నవ్వులతో నిండి పోయింది ★

